## ఎర్రకుంట చెరువులో నిర్మాణం
# బిల్డర్‌పై కేసు నమోదు

దుండిగల్,ఆగస్టు 21 : బాచుపల్లిలోని ఎర్ర కుంట ఎఫ్‌టీఎల్,బఫర్‌జోన్లను ఆక్రమించి అపార్ట్‌మెంట్‌లను నిర్మించిన బిల్డర్‌పై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,బాచుపల్లి మండలం సర్వే నంబర్ 134లోని ఎర్రకుంట చెరువు బఫర్,ఎఫ్‌టీఎల్ పరిధిలో మ్యాప్స్ ఇన్‌ఫ్రా పేరుతో పీ.సుధాకర్‌రెడ్డి అనే బిల్డర్ మూడు అపార్ట్‌మెంట్‌లను నిర్మిస్తున్నారు.నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈ నెల 14న హైడ్రా ఐదు అంతస్థుల్లో నిర్మించిన మూడు అపార్ట్‌మెంట్‌లను నేలమట్టం చేశారు. ఈ నేపథ్యంలో బాచుపల్లి మండలం ఇరిగేషన్ ఏఈ సారా మంగళవారం ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన బిల్డర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు మేరకు బిల్డర్ సుధాకర్‌రెడ్డిపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి

మేడ్చల్ కలెక్టరేట్: మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ నాగారం మున్సిపల్ కార్మికులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.శివారు మున్సిపాలిటీల్లో కార్మికులకు ఎక్కువ వేతనాలు ఇస్తున్నారని, నాగారం మున్సిపాలిటీలో తక్కువ వేతనం ఇస్తూ 9 గంటలు పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లను డ్రైవర్లుగా గుర్తిస్తూ డ్రైవర్ల వేతనాలు ఇవ్వాలని, డ్రైవర్ల పని తప్ప వేరే పని వారితో చేయించరాదని అన్నారు. 8 గంటల కంటే ఎక్కువ పని చేయిస్తే ఓటి ఇవ్వాలని, నెలకు నాలుగు వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయతీ నుంచి వచ్చిన కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తిస్తూ.. రూ. 20వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం

మియాపూర్/కొండాపూర్, ఆగస్టు 21 : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చెరువుల సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయని నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. చెరువుల సుందరీకరణ పనుల్లో భాగంగా బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు, మియాపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు పనులను ఆయన కార్పొరేటర్లు మంజుల రఘునాథరెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఉన్న చెరువుల సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, ఇప్పటికే కొన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ శంకర్ నాయక్, ఈఈ కేవీఎస్ రాజు, డీఈ శిరీష, దుర్గ ప్రసాద్, స్రవంతి, ఏఈ సంతోష్‌రెడ్డి, స్ట్రీట్ లైట్స్ ఈఈ మల్లికార్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు మంజుల, శ్రీకాంత్, జెడ్సీ ఉపేందర్‌రెడ్డిలు తదితరులు

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,ఆగస్టు 21 : ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోకవర్గంలోని ఆయా కాలనీలోని సంక్షేమ సంఘా ల ప్రతినిధులు,పార్టీ శ్రేణులు, పలువురు పేట్ బషీరాబాద్‌లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లైన్లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు,ప్రజలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట, ఆగస్టు 21: అవంతినగర్ కాలనీలోని ఈస్ట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేట డివిజన్ పరిధి అవంతినగర్ ఈస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణారావు వారిని శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి, వీరబాబు, దేవేందర్, సుశీల్, బ్రహ్మచారి, శాంసన్ రెడ్డి, రాజు, రమేష్, చౌహన్, దన్దీప టేల్, రమణ, శర్మ, శ్రీకాంత్, శివ, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఏవైఎస్ మూసాపేట
## అధ్యక్షుడిగా కర్క మహేశ్

ఆల్ ఇండియా అంబేద్కర్ యూవజన సంఘం మూసాపేట డివిజన్ అధ్యక్షుడిగా కర్క మహేశ్ నియమితులయ్యారు. ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో జాతీయ కోఆర్డినేటర్ వరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు చేతుల మీదుగా నియమక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు దుర్గాప్రసాద్, ప్రమోద్‌కుమార్, వినయ్, నరేశ్, ప్రభుదాస్, శంకర్, నితీశ్, ఫణింద్రా, భరత్, పవన్ తదితరులు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ

శంషీగూడ వార్డు కార్యాలయంలో చిన్నారికి టీకా వేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్, చిత్రంలో ఆశ సిబ్బంది

# పిల్లలకు మెదడువాపు టీకాలు వేయించాలి

మియాపూర్ , ఆగస్టు 21 : ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ వార్డు కార్యాలయంలో మెదడు వాపు వ్యాధి నివారణ టీకాల ప్రక్రియను కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయసున్న చిన్నారులందరికీ విధిగా ఈ టీకాను తల్లిదండ్రులు వేయించాలని కోరారు. టీకాను అశ్రద్ధ చేయొద్దని చిన్నారులు జబ్బుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి,రవికుమార్ ఆశ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో నీటి వసతికి నూతన బోరు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు.

పీఆర్‌టీయూటీఎస్ కూకట్‌పల్లి మండల అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్‌రావు

తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రెస్సివ్ రికాగ్నిస్ట్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూటీఎస్) కూకట్‌పల్లి మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. బుధవారం కూకట్‌పల్లిలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా సి.విట్టల్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా పి.రవీంద్ర, కార్యదర్శిగా ఆర్ వీరేందర్, మహిళాధ్యక్షులిగా బి.రాధిక, కార్యదర్శిగా ఎస్.లక్ష్మిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... కూకట్‌పల్లి మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. – కేపీహెచ్‌బీ కాలనీ

## సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

మేడ్చల్,ఆగస్టు 21: మేడ్చల్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ ఉమానాగరాజు అన్నారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ నేషనల్ హైవే 44 మేడ్చల్ పట్టణంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారిందన్నారు. కొత్త రోడ్డును ఏర్పాటు చేయాలని అందుకోసం ఎన్‌హెచ్ 44 అధికారులను ఆదేశించాలని కోరామన్నారు.

## తూంకుంటలో ఎల్‌ఆర్‌ఎస్ మేళా

శామీర్‌పేట, ఆగస్టు 21: తూంకుంట మున్సిపాలిటీ ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వెంకట గోపాల్ కోరారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి తమ ప్లాట్ల ను వెంటనే క్రమబద్ధీకరించుకొనేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నదని తెలిపారు. గురువారం నుంచి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారు వెంట నే మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు.హెల్ప్ డెస్క్ సిబ్బంది పల్లె జీవన్ 8978146897, భానుచందర్ 91542 79692ని సంప్రదించాలని కోరారు.

## వరదముంపు రాకుండా చర్యలు

మల్కాజిగిరి: వరదముంపు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం బీజేఆర్ నగర్‌లో డ్రైనేజీ కాలువలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లుతున్నాయన్నారు. ప్రస్తుతం వీటిలోని పూడికలను తొలగిస్తామని, కొత్త డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు.

# ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని అన్ని పీజీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఏ, ఎమ్‌కాం, ఎంకామ్ (ఐఏస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, యూజీసీ నెట్, టీజీ – సెట్ పరీక్షల నేపథ్యంలో వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలు తిరిగి నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### లా కోర్సుల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువును పొడగించినట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకాం, ఎల్ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈనెల 17వరకు స్వీకరించినట్లు చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 23వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

### ఎంపీఈడీ పరీక్ష ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

## పార్కు చేసిన బైక్ మాయం

మూసాపేట, ఆగస్టు 21: ఇంటి ముందు పార్కు చేసిన బైక్ తెల్లారేసరికి మాయమైన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పి. శివరాజ్ యాదవ్ మూసాపేట యాదవబస్తీలో నివసిస్తూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. రోజులాగే తన బైక్ (TS 08FA 7289)ను మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్కు చేశాడు. ఉదయం లేచేసరికి పార్కు చేసిన బైక్ కనిపించక పోవడంతో బుధవారం కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

కుత్బుల్లాపూర్,ఆగస్టు 21: విద్యుదాఘాతంతో వలస కార్మికుడు మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన మనీశ్‌కుమార్‌సింగ్(39) కొన్నేండ్ల కిందట తన కుటుంబ సభ్యులతో కలిసి నగరంలో నివాసం ఉంటున్నాడు. దూలపల్లిలోని దుర్గామెటల్స్ కంపెనీ లో కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా మంగళవారం తాను పని చేసే కంపెనీలో కరెంటు సరఫరా లేకపోవడంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతులు చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు గురయ్యాడు. స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కరాటేలో ఉచిత శిక్షణ

మేడ్చల్, ఆగస్టు 21: ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని మేడ్చల్ పట్టణంలోని ఆడపిల్లలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కరాటే మాస్టర్ సాయికుమార్ కోరారు. రోజు రోజుకు మహిళలపై సమాజంలో జరుగుతున్న ఆకృత్యాలతో తనవంతు సామాజిక బాధ్యతగా ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.మేడ్చల్ పట్టణంలో విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారి వీలును బట్టి వారివారి పాఠశాలల్లో కానీ కాలనీల్లో కానీ, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులైతే ఆర్టీసీ డిపోలో కాని వీలును బట్టి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వివరాలకు సాయికుమార్ 9014604209 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

# యువతకు ఆదర్శం తులసిరెడ్డి

దుండిగల్,ఆగస్టు 21 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,దుండిగల్ మున్సిపాలిటీలోని బౌరంపేట్‌కు చెందిన యువకుడు పల్పునూరి తులసిరెడ్డి 2016లో తన గ్రాడ్యుయేషన్ అనంతరం పర్వత శిఖరాలను అధిరోహించాలని ఆసక్తితో అప్పటి నుంచి శిక్షణ పొంది మొదటిసారిగా 2022లో ఆసియా ఖండం,భారతదేశంలోని లడఖ్‌లో 3610 మీటర్ల ఎత్తయిన స్టాక్ కాంగ్రీ పర్వతాన్ని అధిరోహించారు.అదే స్పూర్తితో 2023 సంవత్సరంలో కశ్మీర్‌లోని 4190 మీటర్ల ఎత్తైన గగ్రేట్ లేక్స్‌ను,ఆఫ్రికా ఖండంలో 5859 మీటర్ల ఎత్తైన కిల్లిమంజారో పర్వతాన్ని అధిరోహించి తన సత్తాచాటారు.ప్రపంచంలోని ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకొని ఈ నెల 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఐరోపా ఖండంలోని 5642 మీటర్ల ఎత్తైన మౌంట్ ఎల్బర్స్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా తులసిరెడ్డి బుధవారం బౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలువగా తులసి రెడ్డిని కౌన్సిలర్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూడా మరిన్ని శిఖరాలను అధిరోహించి యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు.


తులసిరెడ్డిని అభినందిస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,తదితరులు

ఆగని వైద్యుల ఆగ్రహం: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం ఖైరతాబాద్‌లో ఉన్న నిమ్స్ దవాఖాన ఆవరణలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో వైద్యులపై దాడులు జరగకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## గృహిణి ఆత్మహత్య

కొండాపూర్, ఆగస్టు 21 : గృహిణి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని కాకినాడకు చెందిన వరలక్ష్మి సత్య శివప్రసాద్‌తో 6 నెలల క్రితం వివాహం జరిగింది. ఉద్యోగ నిమిత్తం నగరానికి వచ్చి చందానగర్‌లోని కైలాష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. సత్య శివప్రసాద్ ఓ ప్రైవేట్ సంస్థలు విధులు నిర్వహిస్తుండగా, వివాహనికి ముందు చేసిన అప్పులు తీర్చలేక భయాందోళనకు లోనైన వరలక్ష్మి ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సత్య శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మహిళ అదృశ్యం

సోనియా భాయ్ (ఫైల్)

కొండాపూర్, ఆగస్టు 21 : భర్తతో గొడవపడి భార్య ఇంట్లో నుంచి వెళ్ళిపోయిన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... నారాయణఖేడ్‌కు చెందిన జ్ఞానేశ్వర్, భార్య సోనియా భాయ్ ఇద్దరు పిల్లలతో కలిసి లింగంపల్లి తారానగర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా జ్ఞానేశ్వర్ స్థానికంగా పానీపూరి బండి నడుపుతున్నాడు. మంగళవారం ఉద యం సోనియా భాయ్ భర్త జ్ఞానేశ్వర్‌తో గొడవ పడి ఇంట్లో చెప్పాపెట్టకుండా బయటకు వెళ్ళిపోయింది. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వారిని, తెలిసిన వారిని, బంధువులను ఆరాతీయగా సమాచారం లభించకపోవడంతో చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భర్తతో గొడవ:భార్య ఆత్మహత్య

కొండాపూర్, ఆగస్టు 21 : భర్తతో గొడవపడి మనస్థాపం చెందిన భార్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నాగమల్లేశ్వరరావు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, భార్య విజయ, ఇద్దరు కూతుళ్లతో కలిసి లింగంపల్లి వెంకట్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య నిత్యం చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. మంగళవారం భర్త ఆఫీసుకు వెళ్ళే సమయంలో మరోమారు చిన్నపాటి గొడవ జరగడంతో విజయ గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది. నాగమల్లేశ్వరరావు చొక్కా వేసుకుందామని గది తలుపు తీసేసరికి విజయ తాడుకు వేలాడుతు కనిపించింది. వెంటనే ఆమెను కిందకు దింపి చికిత్స నిమిత్తం స్థానిక దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ విజయ బుధవారం మృతిచెందింది. ఈ మేరకు విజయ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తోటి జర్నలిస్టుకు ఆర్థిక సాయం అందజేత

జర్నలిస్టు సూర్య కిరణ్‌కు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్

మాదాపూర్, ఆగస్టు 21: అనారోగ్యానికి గురైన జర్నలిస్టుకు ఆర్థిక సాయం చేసేందుకు తోటి జర్నలిస్టులు ముందుకొచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో జర్నలిస్టుగా పనిచేస్తున్న సూర్య కిరణ్ అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసేందుకు బుధవారం టీయూడబ్ల్యూజే (ఐజేయు) శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండా విజయ్ జర్నలిస్టు మిత్రులతో కలిసి మాదాపూర్‌లోని సూర్య కిరణ్ నివాసానికి చేరుకొని రూ. 63 వేల 500 నగదును అందజేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ ... మిత్రుడు సూర్య కిరణ్ కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకొని శేరిలింగంపల్లి జర్నలిస్టుల సహకారంతో ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

# కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 21 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 15, వంకాయ 23, బెండకాయ 18, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 65, కాకరకాయ 20, బీరకాయ 23, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 45, కాలీఫ్లవర్ 18, దొండ 25, చిక్కుడు 35, గోరుచిక్కుడు 23, బీట్‌రూట్ 28, క్యాప్సికం 55, ఆలుగడ్డ 37, కీర 21, దోసకాయ 13, సోరకాయ 9, పొట్లకాయ (1) 13, కందగడ్డ 50, ఉల్లిపొరక 28 , ఉల్లిగడ్డ 44, చింతకాయ–, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ (1) 8 నుంచి 10, చామగడ్డ 23, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 65, గుమ్మడికాయ 18, నిమ్మకాయలు(12)40 నుంచి 50, మునగకా య(1) 6 నుంచి 8, పచ్చిబఠాని–, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 320, చింతపండు 140, కరివేపాకు 80 రూపాయలుగా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

### అక్రమ నిర్మాణదారులపై
# చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 21 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరు తూ.. బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు నగరంలోని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం శంషాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. శంషాబాద్ పట్టణంలోని కాముని చెరువు అలుగుపై చేపట్టిన నిర్మాణంతో పాటు దోషికుంట కబ్జా నుంచి కాపాడాలని, సాతంరాయిలోని రామాలయం భూములను కబ్జా చేయడమే కాకుండా అక్రమంగా చేపట్టిన నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన్నట్లు తెలిపారు. ఫిర్యాదు పత్రాలను శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు సైతం ఇచ్చిన్నట్లు వివరించారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చెరువులు, దేవాలయ భూములతో పాటు నాలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్, కొండ పరమేశ్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

# కావాలనే..వేధింపులు

### ఆవేదన వ్యక్తం చేసిన అటెండర్ అనిల్

బాలానగర్, ఆగస్టు 21 : తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌లు వేధింపులకు గురి చేస్తున్నారని అటెండర్ అనిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో పంచనామా నిర్వహించేందుకు కాలుకు గాయమై నడవలేని స్థితిలో ఉన్నా తనను పంచనామా చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ దివ్యలు కలిసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విలేకరులతో తమ గోడును వెల్లబోసుకున్నాడు. తనకు వాహనం నడుపుట రాదని తెలిసినా తహసీల్దార్ కొన్ని రోజులుగా సంబంధంలేని పనులు చెబుతూ తీవ్రంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. బయటకు వెళ్లాలంటే ఆటోలో వెళ్లాల్సి ఉన్నందున ఆటో చార్జీలు తనకు భారంగా మారాయన్నారు.

## ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల ధర్నా

శామీర్‌పేట, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మోహన్ కృష్ణ అన్నారు. మాలల ఆత్మగౌరవ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపు మేరకు మండలంలోని అలియాబాద్ చౌరస్తా, శామీర్‌పేట, అలియాబాద్, ఉప్పర్‌పల్లి, లాల్‌గడి మలక్‌పేట తదితర గ్రామాల్లో ఆందోళనలు, ధర్నాలు నిర్వహించారు.